క్లుప్తంగా

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముత్యం సూరిబాబును అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏబీ నాగేశ్వరరావు సేవలు ఆదర్శనీయం



ఏబీ నాగేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ మంత్రి, స్వాతంత్య్ర సమర యోధుడు ఏబీ నాగేశ్వరరావు సేవలు ఆదర్శనీయమని రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఏబీ నాగేశ్వరరావు జయంతి సందర్భంగా బుధవారం స్థానిక సీతంపేట పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏబీ నాగేశ్వరరావు నిస్వార్థంగా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎస్పీ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

కడియం: వార్షిక విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వేమగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌కు సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. కడియం, వేమగిరి, జేగురుపాడు, కడియపుసావరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: హుకుంపేట సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ మరమ్మత్తుల కోసం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు. వెంకటగిరి-2, బాపూజీ నగర్, గంగిరెడ్ల కాలనీ, జై హింద్ నగర్, వరలక్ష్మి కాలనీ, డీఎస్ఆర్ నగర్, హుకుంపేట విలేజ్, గణేష్ నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి

ప్రకాశం నగర్: కళాగౌతమి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి సభ నిర్వహించారు. ముందుగా దేవులపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమైన కవి కృష్ణశాస్త్రి అని కొనియాడారు. కార్యక్రమానికి తెలుగుశాఖాధిపతి సంజీవరావు అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎబల్ రాజబాబు, తెలుగు అధ్యాపకురాలు పల్లి సుధ పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా నూతన కమిటీని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు బుధవారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా దున్న సుమన్ బాబు, జనరల్ సెక్రటరీలుగా పల్లి ధర్మేష్ ప్రసాద్ కుమార్, బొంతు నిరంజన్ బాబు, ఉపాధ్యక్షులుగా వరిగేటి సయ్యద్ బాబు, పెదపూడి రాజు, రాయుడు సత్యనారాయణ, కొడమంచిలి అంజలి, కంచుమర్తి ధనలక్ష్మి, ఇందుర్తి సుస్వేశ్వరరావు, కార్యదర్శులుగా ప్రత్తిపాటి మోహనరావు, గోలి దుర్గారావు, మల్లిపూడి రవికుమార్, కోట రాము, గోవింద్ రానా, ప్రతాప్, కోశాధికారిగా మాదాసు బేబీ నియమితులయ్యారు.

ఖైదీల కేసుల దర్యాప్తుపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: స్థానిక జిల్లా కోర్టు ప్రధాన కార్యాలయ ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆధ్వర్యంలో బుధవారం ఎగ్జిక్యూటివ్ బాడీ, అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ సమావేశాలు నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు న్యాయమూర్తి సునీత పలు సూచనలు చేశారు. బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సంబంధిత న్యాయస్థానాలకు సిఫారసులు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాచరణ, బాధితుల పరిహారాల కేసులపై చర్చించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఏఎస్‌పీజీ వెంకటేశ్వరరావు, సెంట్రల్ జైలు, ప్రత్యేక జైలు అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులు.. వెచ్చని నేస్తాలు

- జోరందుకున్న విక్రయాలు
- ఆకట్టుకుంటున్న రాజస్థాన్, టిబెట్ వాసుల దుకాణాలు



కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణాలు



ఆకట్టుకుంటున్న దుస్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చలి తీవ్రతను తగ్గించే ఉన్ని దుస్తులు మార్కెట్‌లోకి వచ్చేశాయి. ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తుండటంతో గిరాకీ కూడా పెరిగింది. ఈ క్రమంలోనే ప్రజల అవసరాలకు అనుగుణంగా రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాల్లో ఉన్ని స్వెట్టర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. టిబెట్, నేపాల్, రాజస్థాన్ ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఏటా మాదిరిగానే దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే వీరితో పాటు స్థానికులు సైతం ఉన్నిదుస్తుల విక్రయాలు జరుపుతున్నారు.

జీవనోపాధి కోసం

టిబెటియన్లు 43 ఏళ్లుగా రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండ్ సమీపంలో ఉన్ని దుస్తుల దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఏటా అక్టోబర్‌లో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలో టిబెటియన్లు, రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో రాజస్థాన్ వాసులు విక్రయాలు జరుపుతున్నారు. రాజమహేంద్రవరంలో ఈ సీజన్‌లో అధికంగానే దుకాణాలు వెలిశాయి. ఎంతో కాలం నుంచి ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో వారికి స్థానికులు కూడా ఇళ్లను అద్దెకు ఇస్తుంటారు. వాటిలో ఉన్ని దుస్తులు నిల్వలు దాచుకుని మళ్లీ సీజన్‌లో ఇక్కడకు వచ్చి కార్యకలాపాలు కొనసాగిస్తారు. మిగిలిన ఎనిమిది నెలలు తమ స్వస్థలానికి వెళ్లిపోతారు.

రకరకాల దుస్తులు

చలి నుంచి కాపాడుకోవడానికి పలు రకాల స్వెట్టర్లు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. స్వెట్టర్లు, మఫ్లర్లు, బ్యాంకెట్లు, జంబుఖానాలు, రెయిన్ కోట్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, జర్కిన్లు, గరం కోట్లు ఇలా చాలా రకాల ఉన్ని దుస్తులు, వస్త్రాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. యంత్రాలతో చేసిన స్వెట్టర్ల ధర కన్నా చేతితో అల్లిన స్వెట్టర్లు ఎక్కువ వెచ్చదనాన్ని ఇస్తాయి. తయారు చేసేందుకు శ్రమ కూడా ఎక్కువగా ఉండడంతో ధర కూడా కాస్త ఎక్కువే. పంజాబ్, లూథియానా, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుంటారు. స్వెట్టర్లు రూ.300 నుంచి రూ.800 వరకూ, చిన్నపిల్లలవి రూ.250 నుంచి రూ.700 వరకూ పలుకుతున్నాయి. బ్లాంకెట్లు మోడళ్లను బట్టి ధర పలుకుతున్నాయి.

నాణ్యతకు ప్రాధాన్యం



మావద్ద ఉన్ని దుస్తులు నాణ్యతతో ఉంటాయి. 43 ఏళ్లుగా రాజమహేంద్రవరంలో విక్రయాలు జరుపుతున్నాం. ప్రజలు కూడా నమ్మకంతో ఆదరిస్తుండడంతో ఏటా ఇక్కడకు వస్తున్నాం. ఈ ఏడాది కూడా అందుబాటు ధరలతో పాటు నాణ్యమైన స్వెట్టర్లు అందుబాటులో ఉన్నాయి. చేతితో అల్లిన దుస్తులను సైతం విక్రయిస్తున్నాం.

– డోలామా, టిబెట్ వ్యాపారి

20 ఏళ్లుగా వస్తున్నాం



ఏటా అక్టోబర్‌లో ఇక్కడికు వచ్చి ఫిబ్రవరి చివరి వరకూ వ్యాపారాలు కొనసాగిస్తాం. మా వద్ద నాణ్యమైన ఉన్నిదుస్తులు, స్వెట్టర్లు లభిస్తుండడంతో అమ్మకాలు బాగా ఉంటాయి. 20 ఏళ్లుగా ప్రజలు మాపై నమ్మకంతో దుస్తుల్ని కొనుగోలు చేస్తున్నారు.

– బినోద్ కౌశల్, టిబెట్ వ్యాపారి

దేశాభివృద్ధికి అవినీతే అవరోధం



మాట్లాడుతున్న రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కుమార్

కంబాలచెరువు: అవినీతి వద్దని చెబుదాం.. జాతికి అంకితమవుదాం అంటూ విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. గత నెల 30 నుంచి ఈనెల ఐదో తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ వారోత్సవాలను రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కుమార్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి అవినీతి అవరోధంగా మారిందన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సెమినార్‌కు ప్రత్యేక అతిథిగా హాజరైన డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి ఎం.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ అధికారి కె.శామ్యూల్ రాజు, డీఎస్పీ పి.ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

నిందితుడి కుటుంబంతో భయాందోళన

- భరత్‌రామ్‌కు విన్నవించిన మహిళలు
- పరిష్కారానికి ఎంపీ భరోసా



మృతుడి తల్లి సత్యవతికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో నిందితుడి కుటుంబం ఇంకా అక్కడే ఉందని, వారి కారణంగా భయం భయంగా గడుపుతున్నామని మృతుడి తల్లితో పాటు పలువురు మహిళలు బుధవారం ఎంపీ మార్గాని భరత్‌రామ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వీఎల్‌పురంలోని కార్యాలయంలో ఎంపీ కలిసి తమ బాధ వెల్లడించారు. ఇటీవల బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో ఓ యువకుడు కిరాతకంగా అన్నదమ్ములపై దాడిచేసిన సంఘటనలో నరేష్ మృతి చెందగా, అతనిసోదరుడు సురేష్ తీవ్రగాయపడిన సంగతి తెలిసిందే. సురేష్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే డిశ్చార్జ్ అయ్యాడు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ అక్టోబర్‌లో నిందితుడి కుటుంబాన్ని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని కోరామన్నారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశాల మేరకు ఆ కుటుంబం అక్కడి నుంచి వెళ్లిపోయిందని, అయితే మళ్లీ రెండు రోజులకు తిరిగి వచ్చేసిందన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం

ఎంపీ భరత్ రామ్ ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని బుధవారం మృతుడి తల్లి సత్యవతికి అందజేశారు. ఈ సొమ్మును మానవత్వంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమకూర్చారని తెలిపారు. ప్రభుత్వం నుంచి కూడా ఆర్థిక సాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. డీఎస్పీతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరిస్తానన్నారు. రాష్ట్ర ఖాదీబోర్డు వైస్‌చైర్మన్ పిల్లి నిర్మల, పోలు విజయలక్ష్మి, పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి నిరంతర కృషి

- ఎంపీ భరత్ రామ్
- వై ఏపీ నీడ్స్ జగన్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై బుధవారం స్థానిక మల్లికార్జున్ నగర్ సీఎంసీ కమ్యూనిటీ హాల్లో క్లస్టర్ అధ్యక్షుడు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ నిరంతరం పేదల కోసం పరితపించే మానవతామూర్తి జగనన్న అని, అటువంటి నాయకుడు పది కాలాలపాటు సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో నెంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అసలైన నాయకుడు ఎలా ఉండాలో, అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో ప్రజలకు అర్థమయ్యేలా చేసి చూపించారన్నారు. గతంలో విద్యారంగం పూర్తిగా మాఫియా చేతిలో ఉండేదని, దానివల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. ఇదే రీతిలో అన్ని రంగాలు భ్రష్టు పట్టాయన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అన్ని రంగాలను ప్రక్షాళన చేస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు 15 సంవత్సరాల పాటు మేయర్లుగా పనిచేసి పర్సంటేజీలు తీసుకోవడం తప్పిస్తే, నగరానికి ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. పుష్కరాలకు రూ.2 వేల కోట్లు ప్రత్యేక నిధులు వచ్చాయని ఆ నిధులతో ఏమి చేశారో టీడీపీ నాయకులు చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో కేవలం రూ.330 కోట్లతో ఎంత అభివృద్ధి చేశామో ప్రజలు స్వయంగా చూసి అభినందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు అవగాహన అయ్యేలా వివరించాల్సిన బాధ్యత గృహసారథులు, వార్డు వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులదేనన్నారు. సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమం అందరికీ అందాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఉద్దేశ్యమన్నారు. మరో 30 ఏళ్లపాటు ఆయన అధికారంలో ఉండేలా ప్రజలు దీవించాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, కారుమంచి రమేష్, పాలిక శ్రీను పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వేమగిరి మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బడుగు ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం వేమగిరి సచివాలయం -2లో వైద్య శిబిరాన్ని సచివాలయం కన్వీనర్లతో కలిసి వారు ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు కోరాడ కావ్య, యశస్వి, జి.సురేష్ బాబు, పీహెచ్‌సీ వైద్యులు మణిజ్యోత్స్న, నాగసాయిమౌర్య, జెస్సీ ప్రియ, స్వరూప వైద్యసేవలు అందించారు. ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ కె.రాజేష్ కంటిపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 607 మంది వైద్యసేవలు పొందగా, నలుగురిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో 40 మంది వైద్య విద్యార్థులు రోగుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేమగిరిలో మందులు పంపిణీ చేస్తున్న వెంకటాచలం, బడుగు చిన్ని, పాలిక శ్రీను



పిడింగొయ్యిలో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

543 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి సచివాలయం -4 పరిధి సాయిబృందావన్ కాలనీలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 543 మంది వైద్యసేవలు పొందగా, తొమ్మిది మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు శ్రీవైష్ణవి, పార్వతీబాయి, పీహెచ్‌సీ వైద్యులు జి.రోహిత, నాగదేవి వైద్యసేవలు అందించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ కంటిపరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను వైద్యశిబిరాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు చీరారాజు, మళ్లవరపు అన్వేష్, యేసేబు పాల్గొన్నారు.

అవార్డు లభించడం ఆనందదాయకం



అవార్డు అందుకుంటున్న పుత్ర హనోక్

సీటీఆర్ఐ: డొక్కా సీతమ్మ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని నగరానికి చెందిన జేఎస్ఎస్ డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్ అన్నారు. ఆయన మంగళవారం అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ వైజ్ మెన్ ఇంటర్నేషనల్ డొక్కా సీతమ్మ అవార్డును అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శాసన మండలి సభ్యుడు బొమ్మి ఇశ్రాయేలు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం తన స్వగృహంలో హనోక్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జేఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, కుష్ఠ రోగులకు సేవలు చేశామని, సామాజిక కార్యక్రమాలతో పాటు, కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులను అందించామన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మెషీన్లు అందించామన్నారు.

లెర్నింగ్ లాస్ తగ్గించేందుకే ఎఫ్ఎల్ఎన్



ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి సూచనలిస్తున్న డీఈవో అబ్రహం

రాజానగరం: విద్యార్థుల్లో లెర్నింగ్ లాస్‌ను తగ్గించేందుకే ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ ప్రోగ్రామ్ (ఎఫ్ఎల్ఎన్)ను ప్రాథమిక, పూర్వ ప్రాథమిక స్థాయిలో అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. కొండగుంటూరులోని సత్యశ్రీ పరిమళ విద్యాసంస్థలో తూర్పు, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన డీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో అబ్రహం మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య నుంచే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ, విద్యాశాఖలు సంయుక్తంగా ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే అభ్యసనా సామర్థ్యాలను పెంపుదల చేసేందుకు ఎఫ్ఎల్ఎన్ ఉపకరిస్తుందన్నారు. పూర్తిగా యాక్టివిటీ బేస్డ్ విధానంలో విద్యాబోధన సాగుతుందన్నారు. డీఆర్పీలు శిక్షణను సద్వినియోగం చేసుకుని, తిరిగి మండల స్థాయిలో సమర్థంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ట్రెనింగ్ ప్రోగ్రామ్ రాష్ట్ర పరిశీలకులు అరవ ప్రభాకర్ మాట్లాడుతూ మూడేళ్ల పాటు జ్ఞానజ్యోతి కార్యక్రమం అమలవుతుందన్నారు. అభ్యసనా సామర్థ్యాలను చిన్నారుల్లో మెరుగుపర్చేందుకు ఎఫ్ఎల్ఎన్ అద్భుతమైన కార్యక్రమమన్నారు. ఏఎంవో డి.గౌరీశంకర్ మాట్లాడుతూ ఆరు రోజుల పాటు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని డీఆర్పీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కీ రీసోర్స్ పర్సన్లు ఎం.సాంబశివరావు, టి.కనకవల్లి, సీహెచ్.గోవిందరాజు, ఎ.కృష్ణకుమారి, ఎం.రాజేంద్రబాబు, జె.రాజేంద్రబాబు, జె.కళావతి, వీవీవీ వరాహలక్ష్మి, యు.ఎస్.స్వర్ణకుమారి శిక్షణ ఇస్తున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు పాలమూరు విద్యార్థినులు

అనపర్తి: పాలమూరులోని శ్రీసత్తి వీర్రాఘవరెడ్డి, లక్ష్మీనరసయమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ హెచ్ఎం ఆర్.విజయదుర్గ తెలిపారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.కావేరి కోనసీమ జిల్లా కొత్తపేటలో జరిగిన అండర్-17 షూటింగ్ బాల్‌లో ప్రతిభ కనబరిచి, త్వరలో అనంతరపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.హిమవర్షిణి ఆత్రేయపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ప్రకాశం నగర్: నన్నయ యూనివర్సిటీ పరిధిలో గల డిగ్రీ కళాశాలల మధ్య గురువారం నుంచి స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో కబడ్డీ పోటీలు, యూనివర్సిటీ స్థాయి జట్ల ఎంపికలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు ఈనెల 9 నుంచి 12 వరకూ జరిగే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయం కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయన్నారు. సుమారు 45 జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయని చెప్పారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఏఎస్పీ రాజశేఖర్



కడియం గ్రంథాలయంలో..

కంబాలచెరువు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని వక్తలు కొనియాడారు. బుధవారం పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఏఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎం.రజిని, జి.వెంకటేశ్వరరావు, ఆర్ఐలు శ్రీనివాస్, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

కడియం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గౌరవ అధ్యక్షుడు వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, విస్తరణాధికారులు, కార్యాలయం సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. కడియం గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో స్వయం సహాయక సంఘాలు

మధురపూడి: స్వయం సహాయక సంఘాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. బుధవారం కోరుకొండ మండలం కోటికేశవరం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లోని సచివాలయాల్లో డ్వాక్రా గ్రీవెన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను మహరాణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఉన్నట్టు తెలిపారు. అర్హులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందజేయాలన్న ఉద్దేశంతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మురుగు నీటి కాలువల నిర్మాణం, తాగునీటి సమస్యలను తెలయజేశారు. దీనికి స్పందించిన విజయలక్ష్మి త్వరగా పరిష్కరిస్తామన్నారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాలతో పేదల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. తొలుత రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

5,029 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 24వ రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా పది వైద్యశిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. వీటిలో 5,029 మంది రోగులు వైద్యసేవలు పొందగా, 69 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రిలకు రిఫర్ చేశామన్నారు.

3న జగనన్నకు చెబుదాం

రాజానగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం సీతానగరం మండలంలో నిర్వహించనున్నామని కలెక్టర్ కె.మాధవీలత బుధవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. సీతానగరంలోని జేవీకే ఫంక్షన్ హాలులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు.